RNI No: APTEL/2018/76747

# నవతరం

తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | బుధళవారం | సంపుటి: 9 | సంచిక: 236 | పేజీలు: 04 | వెల: 5 /- | 26 ఆగస్టు 2026 |

# ‘హౌసింగ్ బోర్డు’ భూములు మాయం..?

- **బౌరంపేట 472లో భారీ భూస్కామ్.. 6.20 ఎక్కరాలకు స్కెచ్**
- **అందినకాడికి దండుకుంటున్న కబ్జాదారులు**
- **చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్న హౌసింగ్ బోర్డ్ అధికారులు**
- **100 కోట్ల భూస్కామ్ కి తెరలేపిన నాన్ ‘లోకల్ మాఫియా’**
- **ధనార్జనే ధ్యేయంగా ప్లాట్ల అమ్మకాలు.. లబోదిబోమంటున్న కొనుగోలుదారులు**



**మేడ్చల్ జిల్లా బ్యూరో, నవతరం:** దుండిగల్ మండల పరిధిలోని బౌరంపేట లోని ప్రభుత్వ భూములు ఆక్రమించి అందినకాడికి దండుకుంటున్నారు కేటుగాళ్లు. సర్వే నంబర్ 472 లోని సుమారు ఎకరాలు 6.20 గుంటలు ఆక్రమించి అక్రమంగా డంపింగ్ చేస్తూ.. అమ్మకాలు కొనసాగిస్తున్నారు కబ్జాదారులు. ప్రైవేట్ వెంచర్ ను తలపించేలా ప్లాట్ లు ఏర్పాటు చేసి ఒక్కో ప్లాట్ 5,00,000 రూపాయల నుండి 20,00,000 రూపాయలకు అమ్మి జల్సా చేస్తున్నారు ఇక్కడి కబ్జాదారులు. బౌరంపేట - గండిమైసమ్మ ప్రధాన రహదారి పక్కనే పరిమే లోకేషన్ లో ఈ భూములు ఉన్నందున కబ్జాదారుల కన్ను ఈ భూములపై పడింది. స్థానిక, గ్రామస్తులైన సుమారు పదిమంది వద్ద ఒక ఎకరం 1.5 కోట్ల కు కొనుక్కున్నాం అని చెప్పుకుంటున్న సదరు కబ్జాదారుడు.. బహిరంగంగానే ప్లాట్ ల అమ్మకాలు కొనసాగిస్తున్నాడు. ఇప్పటికే సదరు భూములు అమ్ముకుని రెండు కోట్ల రూపాయలు వసూలు చేసినట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. 472 లోని ప్రభుత్వ భూముల అమ్మకాలపై స్థానికులు, సామాజిక కార్యకర్తలు ఎవరైనా ప్రశ్నిస్తే.. నా దగ్గర పట్టా పత్రాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ ఉన్నాయి అంటూ ‘తప్పుడు సమాధానాలు చెబుతూ.. పబ్బం గడుపుకుంటున్నారు’. గత రెండు సంవత్సరాల క్రితం ఇక్కడ వెలిసిన 6 అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపిన రెవెన్యూ అధికారులు తాజాగా అయిదు బేస్మెంట్ లను సైతం తొలగించి ‘GOVT. OF TELANGANA – TELANGANA HOUSING BOARD, THIS LAND BELONGS TO TELANGANA HOUSING BOARD TRESS PASSERS WILL BE PROCECUTED’ అని సూచిక 4 బోర్డులు ఏర్పాటు చేసి అందులోకి ఎవరూ వెళ్ళకుండా క్రంచ్ కొట్టారు. అయినా సదరు భూకబ్జాదారుడు తన ప్లాట్ ల అమ్మకాలు కొనసాగిస్తున్నాడంటే అతిషయోక్తి కాదు. గత మూడు నాలుగు సంవత్సరాలుగా కోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నా ‘హౌసింగ్ బోర్డ్, రెవెన్యూ అధికారులు’ కాసింత ఉదాసీనత పాటించి పరోక్ష సహకారం అందించినట్టు తెలుస్తుంది. ఇదే కబ్జాదారులకు వరమైంది. ఏకంగా ప్రైవేట్ వెంచర్ ను తలపించేలా ఒక్కో ప్లాట్ 75 గజాలుగా విభజించి, 30 ఫీట్ – 40 ఫీట్ రోడ్లు అంటూ అమాయక ప్రజలకు కత్తిపెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఇకనైనా ఇక్కడి భూకబ్జాలపై స్పందించి, అమ్మకందారులపై చార్యాలు తీసుకునే దిశగా అడుగులు వేయాలని దిల్ (హౌసింగ్ బోర్డు) అధికారులకు సూచనలు చేస్తున్నారు స్థానిక ప్రజలు.

## అంతర్రాష్ట్ర దొంగలముఠా అరెస్ట్.. వివరాలు వెల్లడించిన డీసీపీ కోటిరెడ్డి

- **13 చోరీ కేసులు ఛేదించిన జీడిమెట్ల పోలీసులు, సైబరాబాద్ స్పెషల్ టీమ్స్**

**కుత్బుల్లాపూర్, నవతరం:** కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో రాత్రి వేళల్లో మూసివున్న దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన నలుగురు నిందితులను జీడిమెట్ల పోలీసులు, సైబరాబాద్ కమిషనరేట్ ప్రత్యేక బృందాలు అరెస్ట్ చేశాయి. ఈ ముఠా కుత్బుల్లాపూర్ జోన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో చేసిన 13 చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్ వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 5 / 6వ తేదీ అర్ధరాత్రి చింతల్ మెయిన్ రోడ్, గణేష్ నగర్‌లోని అయినాథ్ గ్లాస్ అండ్ ప్లైవుడ్ షాప్లో చోరీ జరిగింది. మూసివున్న దుకాణం షట్టర్‌ను పైకి లేపి కౌంటర్‌లో ఉన్న రూ. 80,000 నగదును దొంగిలించారు. దీనిపై జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక, ఎలక్ట్రానిక్ ఆధారాలను విశ్లేషించిన పోలీసులు నిందితులను గుర్తించారు. చోరీ అనంతరం వారు రాజస్థాన్, గుజరాత్ వైపు పారిపోయినట్లు గుర్తించి ప్రత్యేక బృందాలను అక్కడికి పంపించారు. ఈ క్రమంలో రాజస్థాన్‌లోని బేవార్ జిల్లాలో హరి సింగ్ (30), చందన్ సింగ్ (28)లను, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో లుంబ్ సింగ్ (29), మనోహర్ సింగ్ (20)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత కోర్టుల నుంచి ట్రాన్సిట్ వారెంట్లు పొందిన అనంతరం నిందితులను హైదరాబాద్‌కు తీసుకువచ్చి తదుపరి దర్యాప్తు కొనసాగించారు. నిందితులు ఒకరికొకరు పరిచయం ఉండటంతో ముఠాగా ఏర్పడి రాత్రి వేళల్లో మూసివున్న వాణిజ్య సంస్థలను లక్ష్యంగా చేసుకునేవారు. ముందుగా దుకాణాలను పరిశీలించి, రాత్రి సమయంలో మూసివున్న షాపులను గుర్తించేవారు. అనంతరం అక్కడికి చేరుకుని షట్టర్లను పైకి లేపి లేదా పగులగొట్టి లోపలికి ప్రవేశించేవారు. కొందరు లోపల చోరీ చేస్తుండగా, మరికొందరు బయట కాపలా ఉండేవారు. గండిమైసమ్మ, చింతల్, జీడిమెట్ల, నిజాంపేట్, దూలపల్లి, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లోని క్యాష్ కౌంటర్లు, ఎలక్ట్రికల్/హార్డ్‌వేర్ షాపులు, ప్లైవుడ్ దుకాణాలు, కిరాణా షాపులు, వస్త్ర దుకాణాలు తదితర వాణిజ్య సంస్థలను ఈ ముఠా లక్ష్యంగా చేసుకునేది. దొంగిలించిన నగదు, చోరీ చేసిన వస్తువులను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని నిందితులు పంచుకునేవారు. దర్యాప్తు, విచారణలో నిందితులు మొత్తం 13 చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుల ఛేదనలో కూకట్‌పల్లి CCS ఇన్‌స్పెక్టర్ శ్రీ జగదీష్, దుండిగల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ జి. రమేష్ నాయుడు మరియు వారి బృందాలు కీలకంగా పనిచేశాయి. అంతర్రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని డీసీపీ శ్రీ ఎన్. కోటి రెడ్డి అభినందించారు.

### వాణిజ్య సంస్థల యజమానులకు పోలీసుల సూచనలు

దుకాణాలు, వాణిజ్య సంస్థల యజమానులు రాత్రి వేళల్లో భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సైబరాబాద్ పోలీసులు సూచించారు. దుకాణాల వద్ద రాత్రి సమయంలో కూడా స్పష్టంగా రికార్డు అయ్యేలా CCTV కెమెరాలను ఏర్పాటు చేసి, అవి పనిచేస్తున్నాయో నిర్ధారించుకోవాలి. షట్టర్లు, తాళాలు, ఇతర భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేసుకోవాలి. దుకాణాల చుట్టూ తగినంత లైటింగ్ ఉండేలా చూసుకోవాలి. రాత్రివేళల్లో దుకాణాల్లో పెద్ద మొత్తంలో నగదు ఉంచకూడదు. మూసివున్న దుకాణాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ సూచించారు.

## సామాన్యుడు బతికేదెలా..!

### కేంద్ర రాష్ట్ర పాలకులకు శిరిగిరి బహిరంగలేఖ



ఆకాశాన్ని తాకుతున్న నిత్య అవసరాలు...! దిగజారుతున్న జీవన ప్రమాణాలు...! చిరు, మధ్యతరగతి ఉద్యోగులతోసహా అల్లాడుతున్న ప్రజలు...! పెరగని జీతభత్యాలు...! ఉపాధి అవకాశాలు లేక యువత ఎదురుచూపులు....! ఏపీలో తరలిపోతున్న చిన్న మధ్య తరగతి పరిశ్రమలు...! అంతరించిపోతున్న ప్రభుత్వ రంగ సంస్థలు..! శృతి మించిన పాలకుల స్వార్థం..! నవ చైతన్య యువజన వ్యవస్థాపక చైర్మన్ శిరిగిరివరదరాజపాలకులకుబహిరంగ ప్రకటన విడుదల చేశారు.నేటికీ ప్రభుత్వ రంగ, మరియు ప్రైవేట్ సంస్థలలోని రిటైర్డ్, వాలంటరీ ఉద్యోగులకు సుమారు 80 లక్షల మందికి పెరగని ఈపీఎఫ్పెన్షన్ అర్థాఆకలితో అలమటిస్తున్న వృద్ధులు, ప్రజా ప్రతినిధులు యదేచ్ఛగా వారి చేతులలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొని ప్రజాప్రతినిధులకు మాత్రం జీతభత్యాలు పెంచుకుంటూనే పోతున్నారు...! దేశంలోనూ మరియు కొన్ని రాష్ట్రాలలోనూ అతివృష్టి లేక అనావృష్టి..! రెండింటి ద్వారా అన్నదాతలకు తీరని కష్టాలు...! ముఖ్యముగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోపలు జిల్లాలలో కమ్ముకున్న కరువు సాయిలు...! నివారణ చర్యలు చేపట్టని పాలకులు..! ప్రభుత్వాలు సంక్షేమము, సుపరిపాలన, సామాజిక న్యాయము అన్నది ప్రచారాలకేమిన్న_పరిపాలనలో, అమలులో సున్న (0)...! అభివృద్ధి పేరుతో ప్రజల నెత్తిన మోయలేని భారాన్ని మోపుతూ ఒకటికి మూడింతలు వ్యయం చేస్తూ దోపిడీ చేస్తున్నారు..! తద్వారా భవిష్యత్తులో సామాన్యుడి నెత్తిన అప్పుల భారం తప్పదు. కోట్లాదిరూపాయలవ్యయం తోనిర్మిస్తున్న రోడ్లు, భవనాలు నాణ్యత లోపంతో నెలలలో నే అవిశిథిలమైపోతున్నవి. కాగడా పెట్టి వెతికిన కనిపించని పరిపాలన వికేంద్రీకరణ..! ఉన్నవాడికి ఒక చట్టం_ఒక న్యాయం, ఒక ధర్మం, లేనివాడికి ఒక చట్టం_ఒక న్యాయం, ఒక ధర్మం, అందని ద్రాక్షగా ప్రజాస్వామ్య ఫలాలు. అమలు కానీ రాజ్యాంగ సూత్రాలు...! కనుమరుగవుతున్న సహజ వనరులు...! కనిపించని శాంతి భద్రతలు..! గాంధీ మహాత్ముడు కన్న కలలు నిజము చేసే గ్రామ స్వరాజ్యం ఆవిరైపోతుంది...! పాలకులకు ఒక న్యాయం ,ఒక చట్టం, ఒక ధర్మం, సామాన్యులకు, ప్రశ్నించే వారికి ఒక చట్టం_ఒక న్యాయం, ఒక ధర్మం అని ముందుకు సాగుతుందన్ననేటి పరిపాలన..! ఈ విధానాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్ తరలకుతీరనినష్టముతోపాటు, ప్రాంతీయ విభేదాలు తల ఎత్తి వర్గ బేధాలు కుల, మత బేధాలు అన్నీ కూడా ఏర్పాటుకు పాలకులే బాధ్యత అనే పరిస్థితులుగోచరిస్తున్నయని రాజకీయ విశ్లేషకులు, మేధావులు, అభ్యుదయవాదులు, ప్రజా సంఘాలు అభిప్రాయపడుతూఉన్నటువంటి తరుణంలో ఇప్పటికైనా పాలకులు జరుగుతున్న పరిణామాలనిపరిగణలోకితీసుకొని తప్పులను సరిదిద్ద కొని కుల, మత, రాజకీయాలకి అతీతంగరాజ్యాంగస్ఫూర్తికి అనుకూలముగా ప్రజాస్వామ్య ఉనికికి ముప్పు లేని విధంగా ప్రజా ప్రభుత్వాలు పరిపాలన సాగించేందుకు ప్రయత్నిస్తాయనిఆశిస్తూఉన్నట్లు శిరిగిరి వరదరాజ పాలకులకు తన ప్రకటనలో ఆందోళన చెందుతూ తెలిపారు. ఈనేపద్యంలో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పాలక పక్షాలు ,ప్రజల ఆకాంక్షను ఆలోచనలకు అనుగుణంగానుచట్టాన్ని గౌరవిస్తూ రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగుతాయని ఆశ భావం శిరి గిరివ్యక్తపరిచారు.

# పతకాలు సాధించినప్పుడు ఏమైపోయారు?

- ‘క్రీడామంత్రిత్వ శాఖ బెదిరింపులు నిజం’
- ప్రతిభా తకడపల్లి హాట్‌కామెంట్స్



ప్రతిభా తకడపల్లి, పతకాలు సాధించినప్పుడు రాని ఫేమ్ ఒక్క వీడియో క్లిప్‌తో వచ్చేసింది. ఇప్పుడు ఆమె ఆవేదన కూడా అదే. తాను ఇండియా ప్రతినిధిగా అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటినప్పుడు తనను ఎవరూ పట్టించుకోలేదని ఇప్పుడు మాత్రం తమ స్వార్థ రాజకీయాల కోసం తన క్లిప్పింగ్స్‌ను వైరల్ చేస్తున్నారని మండిపడ్డారు. అయితే సపోర్ట్ చేస్తున్నందుకు ధన్యవాదాలు చెబుతూనే గతంలో పట్టించుకోని వారిని మరోసారి ప్రశ్నించారు. తనను వేధించిన వారిపై విమర్శలు చేశారు. ఎవరు వేధించిన తాను ఇలానే తిరగబడతానని చెప్పుకొచ్చారు.
అంతర్జాతీయ వేదికలపై భారత్ కీర్తి పతాకాన్ని ఎగురవేసి దేశం తరఫున అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొని పతకాలు సాధించిన తకడపల్లి ప్రతిభ మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులు, క్రీడా శాఖలో పురషాహంకార ధోరణిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేకంగా విడుదల చేసిన వీడియోలో అనేక విషయాలను ఆమెన ప్రస్తావించారు.

ప్రతిభ తన క్రీడా ప్రస్థానంలో ఎదుర్కొన్న అత్యంత కఠినమైన క్షణాలను పంచుకుంటూ 2022 డిసెంబర్‌లో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ప్రస్తావించారు. ఆ సమయంలో ఆమె టర్కీ, ఇంగ్లండ్‌లో జరిగిన అంతర్జాతీయ క్రీడా పోటీల్లో భారత్ తరఫున పతకాలు సాధించారు. ఈ ప్రతిష్టాత్మక విజయాల గురించి ఆమె స్వయంగా క్రీడా మంత్రిత్వశాఖకు, క్రీడా మంత్రి కార్యాలయానికి సమాచారం అందించినప్పుడు లభించాల్సిన ప్రోత్సాహానికి బదులు తీవ్రమైన ఇబ్బందులు ఎదురయ్యాయని ఆరోపించారు.
విజయాలు సాధించిన క్రీడాకారిణిని అభినందించాల్సింది పోయి, ఉల్టా క్రీడా మంత్రి కార్యాలయం నుంచి తనకు బెదిరింపులు వచ్చాయని, వారు తనను తీవ్రంగా భయభ్రాంతులకు గురి చేశారని ప్రతిభ వివరించారు. "నన్ను భయపెట్టేందుకు బెదిరించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో నాకు ఎలాంటి గొంతుక కానీ, అండగా నిలిచే సపోర్ట్ సిస్టమ్‌కానీ లేదు. " అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికే అంతర్జాతీయ అథ్లెట్‌గా ఉన్నప్పికీ, ఒంటరిగా నిలబడి పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, తన కెరీర్ నాశనమవుతుందనే భయంతో సాధించాల్సిన లక్ష్యాలు ఇంకా చాలా ఉన్నాయనే ఉద్దేశంతో ఆ సమయంలో తాను మౌనంగా ఉండిపోవాల్సి వచ్చిందని వెల్లడించారు.

### నిజమైన సేవకు రాని గుర్తింపు

గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి వేలాది మంది అమ్మాయిలకు క్రీడల్లో ఉచిత శిక్షణ ఇచ్చినప్పుడు, పోలీసులగా మారాలని వారికి ట్రైనింగ్ ఇచ్చినప్పుడు, పతకాలు తెచ్చినప్పుడు గుర్తింపు రాలేదని ప్రతిభ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వ్యక్తిగత బాధను వ్యక్తపరుస్తూ చేసిన కామెంట్స్ వీడియోను వైరల్ అవుతుందని అన్నారు. దీనికి ఇంతలా సపోర్ట్ వస్తుందని అనుకోలేదని వెల్లడించారు. అయితే క్రీడాకారిణిగా కష్టపడుతున్న రోజుల్లో, మెడల్స్ సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచిన వేళ ఈ మద్దతు ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు.
తాను ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని, అలాగే ఏ పార్టీకీ అనుకూలం కాదని ప్రతిభ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు వస్తుంటాయి, మారుతుంటాయని కానీ క్రీడాకారులు ఎల్లప్పుడూ దేశం కోసం పోరాడుతూనే ఉంటారని ప్రతిభ అన్నారు. ఎలాంటి సపోర్ట్ సిస్టమ్ లేకపోయినా ఎన్నో ఇబ్బుదులు ఎదుర్కొని తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి కేవలం దేశపు జెండాను భుజాన వేసుకునేందుకు, దేశ కీర్తిని రిప్రజెంట్ చేయడానికే బరిలో దిగుతుంటారని పేర్కొన్నారు. ఈ వాస్తవాన్ని క్రీడా మంత్రిత్వశాఖ, దేశ ప్రజలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

### హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ వివాదంతో మరిన్ని బెదిరింపు

2023 హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన వివాదంలో మైనర్‌లకు బెదిరింపులు రావడంతో వారు నోరు విప్పలేదని ప్రతిభ అన్నారు. తాను మాత్రం క్రీడారంగంలోని లోపాలు, అథ్లెట్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మీడియాతో మాట్లాడినట్టు వివరించారు. దీంతో తనకి కూడా ధమ్కీ ఇచ్చారని పేర్కొన్నారు. తనలాగే మైనర్‌లను కూడా బెదిరించి ఉంటారనే ఆరోపించారు.
క్రీడాశాఖలో పెత్తనం చెలాయిస్తున్న కొందరి వ్యవహారశైలి అత్యంత హేయంగా ఉంటుందని, ముఖ్యంగా పురుషాహంకార ధోరణులు క్రీడారంగంలో చాలా ఎక్కువగా ఉంటాయని ఆమె వివరించారు. ఈ ఇగోల కారణంగా క్రీడాకారిణులు పడుతున్న ఇబ్బందులు ఎదుర్కొని నిలబడే శక్తి ధైర్యం చాలా మందికి ఉండవని, ఫలితంగా ఎంతో మంది ప్రతభావంతులైన అమ్మాయిలు క్రీడలను వదిలేసి, పెళ్లిళ్లు చేసుకొని ఇళ్లకే పరిమితమయ్యారని ఆరోపించారు. క్రీడామంత్రిత్వశాఖ పుణ్యమా అని ఎంతో మంది భవిష్యత్ నాశనమైందని ప్రతిభ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

### ఫార్చ్యునర్ కార్లతో వెంబడించి బెదిరింపులు

తనకు ఎదరవుతున్న వేధింపులపై గళం విప్పినందుకు క్రీడాశాఖకు చెందిన కొందరు వ్యక్తులు తనపై వ్యక్తిగతంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని ప్రతిభ ఆరోపించారు. 2023లో తాను మీడియా ముందుకు వచ్చి చేసిన ఆరోపణలకు కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురి చేశారని తెలిపారు. " మీ తల్లిదండ్రులు ఎక్కడ ఉంటారో మాకు తెలుసు" అని ధంకీలు ఇచ్చారని, అలాగే తాము ట్రావెల్ చేసే మార్గాల్లో ఫార్చ్యునర్ కార్లతో వెంబడిస్తూ నిఘా పెట్టారని ఆరోపించారు.
ఒక సాధారణ పీఏ స్థాయి వ్యక్తి తనను ఫార్చ్యునర్ కార్లతో వెంబడించేంత సాహసం చేయలేడని, దీని వెనుక మొత్తం క్రీడాశాఖ మంత్రిత్వ శాక, ఉన్నతాధికారుల అండదండలు ఎంత బలంగా ఉన్నాయో ప్రజలంతా అర్థం చేసుకోవచ్చని ఆమె కామెంట్ చేశారు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ కఠోరంగా శ్రమించి మెడల్స్ సాధిస్తుంటే, క్రీడాకారుల పట్ల కనీస గౌరవ లేకుండా కేవలం తమ పదవులు, అధికారుల కోసం ఇంతటి ఇగోలను ప్రదర్శించడం ఏ రకమైన దేశభక్తి అని ప్రశ్నించారు.

## అధికారం ఉందా లేదా అనేది కాదు

**పలాస, నవతరం:** పలాసలో గల రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజ నివాసం వద్ద సోమవారం సందడి వాతావరణం నెలకొంది. వైఎస్సార్సీపీ మందస మండల యువజన అధ్యక్షుడు, యువ నాయకుడు సేనాపతి కిషోర్ జన్మదిన వేడుకలు పలాసలో గల అప్పలరాజ నివాసం వద్ద ఘనంగా జరిగాయి. పలాసలో గల నివాసానికి ఉదయం నుంచే మందస మండలంలోని వివిధ గ్రామాల నుంచి అభిమానులు, వైఎస్సార్సీపీ కార్యకర్తలు, తూర్పు కాపు సామాజిక వర్గ పెద్దలు, యువత, క్రీడాకారులు, ఆలయ కమిటీల సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలాసలో గల నివాస ప్రాంగణం అంతా పూల దండలు, శుభాకాంక్షల నినాదాలతో మార్మోగింది. పేజీ 3లో..

## కళ్ళున్న "కబోధి" (కాపురానికెళ్ళిన “కామపిశాచి”)

పరువు ప్రతిష్టల్ని పాతాళంలోకి నెట్టి...
కట్టుకున్న వాడి కళ్ళల్లో కారం చల్లి...

గుట్టుగా కాపురం చేసుకునే
తల్లిదండ్రుల గుండెల్లో గునపాలు గుచ్చి...

పేగు త్రెంచుకు పుట్టిన
బిడ్డను పెనం మీదకు విసిరి...

అక్కాచెల్లెళ్ళ అన్నాతమ్ముళ్ళ
చెక్కర మాటల్ని చేదు మాత్రలుగా వూసి...

బంధువుల్ని బాంధవ్యాలను
బంగాళాఖాతంలో త్రోసి...

నీతి నియమాల్ని నిప్పుల్లో పోసి...
సమాజంలో విలువల్ని సమాధి చేసి...

కక్కిన కూటికి
ఆశపడే కుక్కతో
సిగ్గు లజ్జ లేకుండా
మళ్ళీ పెళ్ళంటూ...
మరో శోభనమంటూ...

కళ్ళు పొరలు
కమ్మి కామంతో...
ఉద్యోగ గర్వంతో...
కాపురానికెళ్ళిందో “కామపిశాచి”.

రచన



కవిరత్న, సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్
చరవాణి... 9110784502

## పోలీసులకు, ముస్లీం మతపెద్దలకు దిశానిర్దేశం చేసిన డీసీపీ
# ఎన్. కోటిరెడ్డి, ఐపీఎస్

**జగద్గిరిగుట్ట, నవతరం:** కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి ఐపీఎస్, కుత్బుల్లాపూర్ ఏసీపీ ఏ. బాలగంగిరెడ్డి తో కలిసి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, మిలాద్-ఉన్-నబీ ఊరేగింపు నిర్వాహకులు, ముస్లిం కమ్యూనిటీ పెద్దలతో సమావేశమై మంగళవారం నాడు చర్చించారు. నేడు నిర్వహించనున్న మిలాద్-ఉన్-నబీ పుట్టినరోజ వేడుకలు (ఈద్ - ఈ - మిలాద్) ఊరేగింపుకు సంబంధించిన మార్గం, బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ఊరేగింపు జరగనున్న మార్గాన్ని స్వయంగా పరిశీలించి, ఊరేగింపు ప్రశాంతంగా మరియు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా జరిగేలా సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశారని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఓ ప్రకటనలో తెలిపారు.








## “జెండా కాదు... ప్రజా సమస్యల ఎజెండా కావాలి”
## కబ్జాను కాపాడేవాడు కాదు, ప్రశ్నించేవాడే నిజమైన నాయకుడు

- ఒకే వేదికపై వివిధ రాజకీయ పార్టీల ప్రత్యర్థులు, కొత్త ఆశావహులతో పలాసలో ప్రజా సమస్యల ఎజెండా హీట్
- ఒక పెళ్లి వేడుకలో యాదృచ్ఛికంగా ఒకే వేదికపైకి వివిధ పార్టీల ప్రముఖ నేతలు - పలాసలో ఆసక్తికర భేటీ
- కొత్త ఆశావహులకు బల్ల గిరిబాబు దిశానిర్దేశం - అజెండా మీదకు ప్రజా సమస్యల ఎజెండానే రావాలి
- 100 కోట్ల వాటర్ ప్రాజెక్టు, రైతు బజార్, ఇండోర్ స్టేడియం, డబుల్ రోడ్డు, రింగ్ రోడ్డే ప్రధాన హామీ
- వార్డుల్లో డ్రైనేజీ, తాగునీరు, చెత్త సమస్యలతో నరకం - భూ కబ్జాలు, సూదికొండ మట్టి దోపిడీపై పోరాటం

**పలాస, నవతరం:** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ ఎన్నికల నగారా ఇంకా అధికారికంగా మోగకపోయినా, పలాస రాజకీయాల్లో మాత్రం ఇప్పటి నుంచే ప్రజా సమస్యల ఎజెండా తెరమీదకు వచ్చింది. అందుకు నిదర్శనంగా ఈరోజ పలాసలో జరిగిన ఒక పెళ్లి వేడుక వేదికగా మారింది. ఒక పెళ్లి వేడుక కార్యక్రమంలో యాదృచ్ఛికంగా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు ఒకే చోట భేటీ కావడం విశేషంగా మారింది. నిన్నటి వరకు వేర్వేరు వేదికలపై విమర్శలు, ప్రతి విమర్శలతో కనిపించిన వివిధ రాజకీయ పార్టీల ప్రత్యర్థులు ఒకే వేదికపై ఆత్మీయంగా కలవడం పట్టణంలో హాట్ టాపిక్ గా మారింది.

ఈ పెళ్లి వేడుకకు పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ తాజా మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు, పూర్వ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, వైఎస్సార్సీపీ సీనియర్ నేత వల్లభ వైకుంఠరావు, టీడీపీ నేత మన్యాల శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. సాధారణంగా రాజకీయ వేదికలపై ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే నేతలు, పెళ్లి వేడుకలో మాత్రం రాజకీయాలకు అతీతంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆ తర్వాత తాజా రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా రానున్న మున్సిపల్ ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. పెళ్లి వేడుకలోనే చిన్నపాటి రాజకీయ సమావేశం జరిగినట్లు అయ్యింది.

అదే వేదికపైకి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని తహతహలాడుతున్న కొత్త ఆశావహులు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీరిలో కొందరు ఇప్పటికే వార్డుల్లో తిరుగుతున్నవారు కాగా, మరికొందరు తొలిసారి రాజకీయాల్లోకి రావాలని ఆశపడుతున్న యువత. వారంతా బల్ల గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసి తమకు ఆశీస్సులు కావాలని, ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలో సూచనలు ఇవ్వాలని కోరారు. కొత్త ఆశావహులు ప్రధానంగా ఎన్నికల్లో ప్రజల్లోకి ఏ అంశాలతో వెళ్లాలి అని నేరుగా గిరిబాబును ప్రశ్నించారు. దీనికి గిరిబాబు చాలా స్పష్టంగా, అనుభవపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

ఈ సందర్భంగా బల్ల గిరిబాబు చెప్పిన రెండు పంచ్ డైలాగులు ఇప్పుడు పలాస వీధుల్లో మార్మోగుతున్నాయి. "గతంలోలా జెండాలు, నినాదాలతో ఓట్లు రావు. ఇప్పుడు పేజీ 4లో..

# అధికారం ఉందా లేదా అనేది కాదు

- జనం గుండెల్లో ఉన్నాడా లేదా అనేదే లెక్క.. తూర్పు కాపు దళానికి సేనాపతి.. నమ్మితే ప్రాణం ఇచ్చే మార్క్ రాజకీయం!
- పలాసలో గల రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నివాసం వద్ద సేనాపతి కిషోర్ జన్మదిన వేడుకలు ఘనంగా
- యువతకు ఆదర్శంగా నిలుస్తున్న యువ నాయకుడు
- వైఎస్సార్సీపీ మందస మండల యువజన అధ్యక్షుడు సేనాపతి కిషోర్ కు పలాసలో గల అప్పలరాజు నివాసంలో ఘన సన్మానం
- యూత్ కు బ్రాండ్.. జనానికి బలం అంటూ ప్రశంసించిన అప్పలరాజు
- 2019 ఎన్నికల్లో మందస మండలంలో తూర్పు కాపు సామాజిక వర్గాన్ని వైఎస్సార్సీపీ వైపు మళ్లించడంలో కీలక భూమిక పోషించిన వ్యూహశాలి
- సామాజిక సేవ, ఆధ్యాత్మిక, క్రీడా రంగాల్లో చురుకుగా - యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న నాయకత్వం
- ప్రత్యర్థులకు సైతం ఆప్తుడు - పలాస నియోజకవర్గంలో కులాలకు అతీతంగా గుర్తింపు

**పలాస, నవతరం:** పలాసలో గల రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నివాసం వద్ద సోమవారం సందడి వాతావరణం నెలకొంది. వైఎస్సార్సీపీ మందస మండల యువజన అధ్యక్షుడు, యువ నాయకుడు సేనాపతి కిషోర్ జన్మదిన వేడుకలు పలాసలో గల అప్పలరాజు నివాసం వద్ద ఘనంగా జరిగాయి. పలాసలో గల నివాసానికి ఉదయం నుంచే మందస మండలంలోని వివిధ గ్రామాల నుంచి అభిమానులు, వైఎస్సార్సీపీ కార్యకర్తలు, తూర్పు కాపు సామాజిక వర్గ పెద్దలు, యువత, క్రీడాకారులు, ఆలయ కమిటీల సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలాసలో గల నివాస ప్రాంగణం అంతా పూల దండలు, శుభాకాంక్షల నినాదాలతో మార్మోగింది.

డాక్టర్ సీదిరి అప్పలరాజు స్వయంగా కిషోర్ ను ఆహ్వానించి కేక్ కట్ చేయించారు. శాలువా కప్పి, పూల దండ వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ యువకుడైన సేనాపతి కిషోర్ వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా నిత్యం ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వారికి చేదోడు వాదోడుగా నిలిచే ఇలాంటి యువజన నాయకుడు వైఎస్సార్సీపీలో యువతకు ఆదర్శమన్నారు. పలాసలో గల తన నివాసానికి కిషోర్ ఎప్పుడు వచ్చినా పార్టీ బలోపేతం గురించే చర్చిస్తారని, అలాంటి నిబద్ధత కలిగిన యువకులు పార్టీకి బలమని అన్నారు. కిషోర్ భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని పలాసలో గల నివాసం వద్ద జరిగిన వేడుకలో ఆకాంక్షించారు.

సేనాపతి కిషోర్ రాజకీయ ప్రస్థానం ఆసక్తికరమైనది. చిన్న వయసులోనే వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వం పట్ల ఆకర్షితుడై పార్టీలో చేరారు. చేరినప్పటి నుంచి పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నారు. రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు అత్యంత సన్నిహితుడిగా ఉంటూ, పలాసలో గల ఆయన నివాసంలో నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తున్నారు. వైఎస్సార్సీపీ అధిష్టానం ఆదేశించిన ప్రతి కార్యక్రమం విజయవంతం చేయడంలో సేనాపతి కిషోర్ ముందు వరుసలో నిలుస్తారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు, జగనన్న పుట్టినరోజ వేడుకలు, వైఎస్ఆర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు, గడప గడపకు వైఎస్సార్సీపీ, ప్రభుత్వ పథకాల ప్రచారం, నిరసన దీక్షలు, ఇలా ఏ కార్యక్రమం వచ్చినా పలాసలో గల అప్పలరాజు నివాసం వద్ద ప్రణాళిక వేసి మందస మండలంలో అమలు చేయడంలో కిషోర్ దూకుడుగా వ్యవహరిస్తారు. కార్యకర్తలను సమీకరించడం, వారికి దిశానిర్దేశం చేయడం, కార్యక్రమం విజయవంతం అయ్యే వరకు అక్కడే ఉండి చూసుకోవడం ఆయన ప్రత్యేకత.

2019 సార్వత్రిక ఎన్నికలు పలాస నియోజకవర్గంలో వైఎస్సార్సీపీకి కీలక మలుపు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయానికి మందస మండలంలో తూర్పు కాపు సామాజిక వర్గాన్ని వైఎస్సార్సీపీ వైపు ప్రభావితం చేయడంలో సేనాపతి కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో తూర్పు కాపు సామాజిక వర్గం ఏ పార్టీ వైపు నిలుస్తుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అలాంటి కీలక సమయంలో కిషోర్ తన సామాజిక వర్గంలోని ప్రతి గ్రామం తిరిగి, ప్రతి ఇంటికి వెళ్లి, యువతతో, పెద్దలతో, మహిళలతో మాట్లాడి, జగన్మోహన్ రెడ్డి నాయకత్వం వస్తే జరిగే మేలును వివరించారు. తూర్పు కాపు సామాజిక వర్గానికి రాజకీయంగా, సామాజికంగా దక్కాల్సిన గుర్తింపు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల గురించి వివరించి వారిని వైఎస్సార్సీపీ వైపు నిలిపారు. ఆ కృషి ఫలితం ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. అప్పటి నుంచి తూర్పు కాపు సామాజిక వర్గంలో నమ్మకమైన నాయకత్వంగా, వారి ఆకాంక్షలకు అనుగుణంగా సామాజిక వర్గం బలోపేతానికి తనవంతుగా కిషోర్ కృషి చేస్తున్నారని చెప్పాలి. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా సేనాపతి కిషోర్ కు మందస మండలంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక రంగ కార్యక్రమాల్లో కూడా చురుకైన పాత్ర పోషించడం ఆయనకు అలవాటు. మందసలోని వాసుదేవ పెరుమాళ్ ఆలయం, ఇతర దేవాలయాల్లో జరిగే బ్రహ్మోత్సవాలు, ఉత్సవాల్లో ఆయన ముందుండి పాల్గొంటారు. అన్నదాన కార్యక్రమాలు, పేదలకు వస్త్రదానం, చలికాలంలో దుప్పట్ల పంపిణీ, వేసవిలో చలివేంద్రాలు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ, వైద్య శిబిరాలు వంటి అనేక సేవా కార్యక్రమాలను తన సొంత ఖర్చులతో, స్నేహితుల సహకారంతో నిర్వహిస్తుంటారు.

యువకుడు కావడంతో క్రీడల్లో కూడా తన ప్రతిభా సామర్థ్యాన్ని నిరూపించుకుంటూ, మిగతా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ప్రేరణగా నిలవడం విశేషం. మందస మండలంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లు నిర్వహించి గెలిచిన జట్లకు బహుమతులు, ట్రోఫీలు అందజేస్తారు. రాజకీయాల్లో కూడా చాలా దూకుడు ప్రదర్శిస్తుంటారు. వైఎస్సార్సీపీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా నేరుగా ముందుకు వచ్చి పోరాడే తత్వం ఆయనది. పలుమార్లు వైఎస్సార్సీపీ అధినేత డాక్టర్ జగన్మోహన్ రెడ్డితో మర్యాదపూర్వకంగా కలుస్తూ, యువతరానికి శాశ్వతంగా ఉపయోగపడే ఉపాధి, విద్య, క్రీడా కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్సీపీలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ రాజకీయ ప్రత్యర్థులు కూడా సేనాపతి కిషోర్ అంటే ప్రత్యేక అభిమానం చూపిస్తారు. పలాసలో గల డాక్టర్ అప్పలరాజు నివాసం వద్ద జరిగిన ఈ పుట్టినరోజ వేడుక సందర్భంగా పెద్దలు దీవిస్తూ పలికిన సంస్కృత శ్లోకం అందరినీ ఆకట్టుకుంది.

**"శతమానం భవతి శతాయుః పురుషః శతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి**
**ఆయుర్దేహి యశో దేహి భాగ్యం భగవతి దేహి మే"**

నూరేళ్లు నిండు ఆయుస్సుతో, ఆరోగ్యంతో వర్ధిల్లాలని, యశస్సు, భాగ్యం, సంపదలతో తులతూగాలని దీని అర్థం. సేనాపతి కిషోర్ కూడా ఇదే విధంగా నిండు నూరేళ్లు ప్రజా సేవలో కొనసాగాలని, పలాస నియోజకవర్గంలో యువతకు దారి చూపే నాయకుడిగా నిలవాలని, పలాసలో గల అప్పలరాజు ఆశీస్సులతో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభిమానులు, మండల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.





# భారతీయులు ఏం తాగేవారు?

- ఉదయం లేవగానే బెడ్ కాఫీ కాదు... మన తాతల నోట్లో అమృతం ఉండేది!
- ఏడు గింజలతో మొదలైన కాఫీ కథ... యెమెన్ నుంచి చిక్ మగళూరుకు సూఫీ సన్యాసి తెచ్చిన నల్ల బంగారం!
- బ్రిటిషోడి కుట్రతో వచ్చిన తేనీరు... చైనా దెబ్బకు అస్సాంలో పుట్టిన చాయ్ సామ్రాజ్యం!
- పాలూ, నెయ్యి నీళ్లే అసలైన బుల్లెట్ కాఫీ... మన వంటిల్లే పెద్ద ఆయుర్వేద ల్యాబ్!
- చద్దన్నం నీళ్లు పేదోడి ఫుడ్ కాదు... అది ప్రోబయోటిక్ బాంబ్, రైతన్న రెడ్ బుల్!

నేటి భారతీయుడి ఉదయం కాఫీ లేదా టీ లేకుండా మొదలవ్వదు. నిద్ర లేవగానే వేడి వేడి బెడ్ కాఫీ, ఆఫీస్ కి వెళ్లగానే టీ బ్రేక్, సాయంత్రం స్నేహితులతో చాయ్ పే చర్చా లేకపోతే రోజ గడవదు. మన జీవితంలో ఈ రెండు పానీయాలు ఎంతగా కలిసిపోయాయి అంటే, ఇవి లేని జీవితాన్ని మనం ఊహించలేము. కానీ ఇది నిజమా? ఈ కాఫీ, టీలు లేకపోతే మన పూర్వీకులు బతకలేదా? చరిత్రను తిరగేస్తే ఒక నిజం తెలుస్తుంది. ఈ రెండు పానీయాలు మన దేశంలోకి వచ్చి కేవలం మూడు వందల నుంచి నాలుగు వందల సంవత్సరాలు మాత్రమే అయింది. మరి అంతకు ముందు ఐదు వేల సంవత్సరాల సుదీర్ఘ భారతీయ నాగరికతలో మన తాతలు, ముత్తాతలు ఉదయం లేవగానే ఏం తాగేవారు? వారికి ఈ అలవాటు లేకుండానే రోజంతా పొలాల్లో, యుద్ధ భూముల్లో, గురుకులాల్లో కష్టపడి పని చేసే శక్తి ఎలా వచ్చేది? ఈ ప్రశ్నకు సమాధానం స్టార్ బక్స్ లో లేదు, మన వంటింట్లో, మన పెరట్లో, మన ఆయుర్వేద గ్రంథాల్లో ఉంది. వారు తాగింది కేవలం పానీయం కాదు, అది ఆరోగ్యానికి, ఆయుష్షుకు, బుద్ధికి మూలమైన అమృతం.

మన దేశంలోకి కాఫీ ఎలా వచ్చిందో తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఇది ఒక స్మగ్లింగ్ కథ. పదిహేడవ శతాబ్దం ప్రారంభంలో బాబా బుదాన్ అనే సూఫీ సన్యాసి హజ్ యాత్ర కోసం యెమెన్ లోని మోచా నౌకాశ్రయానికి వెళ్లారు. అక్కడ ప్రజలు ఖహ్వా అనే నల్లటి వేడి పానీయాన్ని తాగి రాత్రంతా ప్రార్థనల్లో, ఉత్సాహంగా ఉండటం చూశారు. దాని ప్రభావం ఆయనకు బాగా నచ్చింది. అప్పట్లో యెమెన్ వారు కాఫీ గింజలను వేయించి లేదా ఉడకబెట్టి మాత్రమే బయటకు పంపేవారు, తద్వారా ఇతర దేశాల్లో మొక్కలు మొలవకుండా చేసేవారు. ఇది వారి వ్యాపార రహస్యం. కానీ బుదాన్ తన భక్తితో పాటు తెలివిని కూడా ఉపయోగించారు. తిరిగి వచ్చేటప్పుడు ఏడు పచ్చి కాఫీ గింజలను తన గడ్డంలో, దుస్తుల్లో దాచుకుని రహస్యంగా తీసుకువచ్చారు. వాటిని కర్ణాటకలోని చిక్ మగళూరు సమీపంలో ఉన్న చంద్రద్రోణ పర్వతాల్లో నాటారు. ఆ పర్వతాలే నేడు ఆయన పేరు మీద బాబా బుదాన్ గిరి కొండలుగా పిలువబడుతున్నాయి. అక్కడి నుంచే భారతదేశంలో కాఫీ చరిత్ర మొదలైంది. అయితే ఇది మొదట్లో సూఫీ సాధువులకు, రాజులకు మాత్రమే పరిమితమైంది. సామాన్యుడి ఇంట్లోకి రావడానికి మరో రెండు వందల ఏళ్లు పట్టింది.

ఇక టీ కథ అయితే పూర్తిగా బ్రిటిష్ వారి వ్యాపార కుట్ర. నిజానికి అస్సాం అడవుల్లో తేయాకు మొక్కలు అడవిగా పెరిగేవి. అక్కడి సింగ్ ఫో తెగ ప్రజలు దాని ఆకులను కోసి, ఎండబెట్టి, నూనెలో వేయించి తినేవారు లేదా కషాయంగా తాగేవారు. దీనిని వారు ఫలాప్ అని పిలిచేవారు. కానీ ప్రపంచానికి టీ రుచిని చూపించింది చైనా. పద్దెనిమిదవ శతాబ్దంలో ప్రపంచ తేయాకు వ్యాపారం మొత్తం చైనా చేతిలో ఉండేది. బ్రిటిష్ వారికి చైనా నుంచి టీ కొనడం చాలా ఖరీదైన వ్యవహారంగా మారింది. దీనికి విరుగుడుగా వారు భారతదేశంలోనే టీని పండించాలని నిర్ణయించారు. 1823లో రాబర్ట్ బ్రూస్ అనే స్కాటిష్ అధికారి సింగ్ ఫో తెగ నాయకుడి దగ్గర ఈ తేయాకు మొక్కలను చూసి ఆశ్చర్యపోయాడు. వెంటనే బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత కంపెనీ చైనా నుంచి రహస్యంగా తేయాకు విత్తనాలు, తేయాకు తయారీ తెలిసిన కార్మికులను తీసుకువచ్చి అస్సాం, డార్జిలింగ్ లో లక్షలాది ఎకరాల్లో తేయాకు తోటలను సృష్టించింది. మొదట్లో భారతీయులు టీ తాగడానికి ఇష్టపడలేదు. దీంతో బ్రిటిష్ వారు రైల్వే స్టేషన్లు, మార్కెట్లలో ఉచితంగా టీ ఇచ్చి, టీ తాగితే శక్తి వస్తుంది అని ప్రచారం చేసి మనకు అలవాటు చేశారు. అలా వ్యాపారం కోసం వచ్చిన టీ, మన సంస్కృతిలో భాగమైపోయింది.

మరి ఈ విదేశీ పానీయాలు రాకముందు మన వాళ్లు ఏం తాగేవారు? వారి ఉదయం ఆవు పాలతో మొదలయ్యేది. పాలు కేవలం పానీయం కాదు, దానిని సంపూర్ణ ఆహారంగా, దైవ ప్రసాదంగా భావించేవారు. ఉదయాన్నే సూర్యోదయానికి ముందే లేచి, తాజాగా పితికిన గోరువెచ్చని పాలలో కొద్దిగా పసుపు, తేనె లేదా నాటు బెల్లం కలిపి తాగేవారు. దీనినే నేడు మనం హల్దీ మిల్క్ లేదా గోల్డెన్ మిల్క్ అని ఆంగ్లంలో గొప్పగా చెప్పుకుంటున్నాము. ఆయుర్వేదంలో దీనిని ఓజస్సును పెంచే పానీయంగా చెబుతారు. కొంతమంది యోగులు, పెద్దలు గోరువెచ్చని నీటిలో ఒక చెంచా ఆవు నెయ్యి కలిపి తాగేవారు. ఇది జీర్ణశక్తిని పెంచి, మెదడు చురుకుగా ఉండటానికి, కీళ్ల నొప్పులు రాకుండా ఉండటానికి సహాయపడుతుందని ఆయుర్వేదం చెబుతోంది. ఇది నేడు జిమ్ లలో వేల రూపాయలు పెట్టి తాగే బుల్లెట్ కాఫీకి మన పూర్వీకుల స్వదేశీ వెర్షన్.



పాల తర్వాత మన పూర్వీకుల ఇళ్లలో ప్రధానంగా కనిపించేవి మూలికా కషాయాలు. ఇంటి పెరట్లో, వంటింట్లో దొరికే వాటితోనే అద్భుతమైన పానీయాలు చేసుకునేవారు. తులసి, అల్లం, దాల్చినచెక్క, మిరియాలు, లవంగాలు, యాలకులు, జీలకర్ర, ధనియాలు, వేపాకు, ఉసిరి వంటి వాటితో కషాయం కాచుకుని తాగేవారు. దీనికి ఏ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ అవసరం లేదు. జలుబు, దగ్గు వస్తే తులసి, అల్లం, మిరియాల కషాయం, కడుపులో అలజడిగా ఉంటే ధనియాలు, జీలకర్ర నీటిని మరిగించి తాగేవారు. వేడి చేస్తే ధనియాల నీళ్లు, చలువ కోసం వెట్టివేరు వేసిన నీళ్లు తాగేవారు. ప్రతి ఇల్లు ఒక చిన్న ఆయుర్వేదశాలగా ఉండేది. ఏ కాలంలో ఏ కషాయం తాగాలో, ఏ ఆకు ఏ రోగాన్ని నయం చేస్తుందో పెద్దలకు క్షుణ్ణంగా తెలుసు. ఈ కషాయాలు కేవలం దాహాన్ని తీర్చడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచే సహజ వ్యాక్సిన్ లుగా పని చేసేవి.

దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఉదయం పానీయం అంటే చద్దన్నం నీళ్లు లేదా తరవాణి. రాత్రి మిగిలిన అన్నంలో నీళ్లు పోసి, కొద్దిగా పెరుగు లేదా మజ్జిగ కలిపి రాత్రంతా పులియబెట్టేవారు. ఉదయాన్నే ఆ నీళ్లను ఉప్పు, చిన్న ఉల్లిపాయలు, పచ్చిమిర్చితో కలిపి తాగేవారు లేదా ఆ అన్నాన్ని తినేవారు. పట్టణాల్లో దీనిని పేదవాడి భోజనం అని **పేజీ 4లో..**

# భారతీయులు ఏం తాగేవారు?

**3వ పేజీ తరువాయి..** చిన్నచూపు చూసేవారు కానీ నేటి సైన్స్ ప్రకారం ఇది అత్యంత శక్తివంతమైన ప్రోబయోటిక్. అమెరికా శాస్త్రవేత్తలు కూడా దీనిని సూపర్ ఫుడ్ అని కొనియాడుతున్నారు. ఇది పొట్టకు చలువ చేసి, జీర్ణక్రియను మెరుగుపరిచి, బి12 విటమిన్ ను అందించి రోజంతా శరీరానికి కావలసిన శక్తిని ఇస్తుంది. రైతులు పొలం పనులకు వెళ్లే ముందు దీనిని తాగి వెళ్లేవారు, మధ్యాహ్నం వరకు ఆకలి వేసేది కాదు, అలసట వచ్చేది కాదు.

గ్రామీణ ప్రాంతాల్లో మజ్జిగకు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. చల్లని తాజా మజ్జిగలో కరివేపాకు, అల్లం, పచ్చిమిర్చి, ఉప్పు వేసి చిలికి తాగడం ఒక ఆచారం. దీనిని దేవామృతం అని పిలిచేవారు. ఎండలో పని చేసి వచ్చిన వారికి మజ్జిగ ఇస్తే వెంటనే అలసట తీరిపోయేది. అలాగే రాగి అంబలి, జొన్న అంబలి, సజ్జలతో చేసిన పానీయాలు, బార్లీ నీళ్లు ఉదయం పూట తాగేవారు. ఇవి శరీరానికి చలవ చేయడంతో పాటు ఇనుము, కాల్షియం వంటి పోషకాలను ఇచ్చి బలాన్ని ఇచ్చేవి. వేసవి కాలంలో బెల్లం పానకం, మామిడి పండుతో చేసిన పనా, చెరుకు రసం, కొబ్బరి నీళ్లు, తాటి ముంజల రసం వంటివి దాహాన్ని తీర్చే ప్రధాన పానీయాలుగా ఉండేవి. మన పూర్వీకులు ప్రకృతికి అనుగుణంగా జీవించారు. వారికి కెఫిన్ తో వచ్చే కృత్రిమ ఉత్సాహం అవసరం లేదు. సహజ పానీయాలతో వచ్చే సహజ శక్తితోనే వందేళ్లు ఆరోగ్యంగా జీవించారు.



# "జెండా కాదు... ప్రజా సమస్యల ఎజెండా కావాలి"

**2వ పేజీ తరువాయి..** అజెండా మీదకు ప్రజా సమస్యల ఎజెండానే రావాలి. కొత్తగా పోటీ చేసే ఆశావహులు వార్డులో ఏం చేశాం, ఏం చేస్తాం అని చెబితేనే జనం నమ్ముతారు. లేదంటే ఇంటి గడప కూడా తొక్కనివ్వరు. టిక్కెట్ తెచ్చుకోవడం గొప్ప కాదు, గెలిచాక ప్రజల సమస్యలు తీర్చే దమ్ము ఉండాలి" అని మొదటి పంచ్ ఇచ్చారు. అలాగే భూ కబ్జాల అంశంపై మాట్లాడుతూ "కబ్జాలను కాపాడేవాడు కాదు, కబ్జాలను ప్రశ్నించేవాడే నిజమైన నాయకుడు" అంటూ రెండో పంచ్ డైలాగ్ విసిరారు. ఈ రెండు డైలాగులు కొత్త ఆశావహుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

ఈ సందర్భంగా ఆయన పలాస ప్రజల దీర్ఘకాలిక సమస్యలను ఎజెండాలోకి తెచ్చారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో పలాస-కాశీబుగ్గకు దాదాపు 100 కోట్ల రూపాయలతో భారీ తాగునీటి పథకం మంజూరైందని, అయితే అది ఇంకా కార్యరూపం దాల్చలేదని గుర్తుచేశారు. పలాసలో వేసవి వస్తే తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటుందని, కాబట్టి ఈ ప్రాజెక్టును వెంటనే నిర్మించేలా ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, పలాస ప్రజల జీవన్మరణ సమస్య అని, దీనిని ప్రజా సమస్యల ఎజెండాలో మొదటి అంశంగా పెట్టాలని అన్నారు.

దీనితో పాటు పలాస రైతులకు సొంతంగా ఒక రైతు బజార్ లేకపోవడం పెద్ద లోటు అని, దీనివల్ల రైతులు, ప్రజలు ఇద్దరూ నష్టపోతున్నారని అన్నారు. రైతు బజార్ ఏర్పాటు తమ ప్రధాన హామీగా ఉండాలని చెప్పారు. అలాగే మున్సిపాలిటీలో నిర్మాణం ప్రారంభమై మధ్యలో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం పనులను పూర్తి చేయాలని, యువతకు క్రీడా సౌకర్యాలు కల్పించడం మున్సిపాలిటీ బాధ్యత అని ఆయన అన్నారు. గతంలో పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చినప్పటికీ, గృహ నిర్మాణంలో జాప్యం జరిగిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన గృహాలు మంజూరు అయ్యేలా చూడాల్సిన బాధ్యత కౌన్సిలర్లపై ఉందని అన్నారు. రోడ్ల విషయానికి వస్తే, కేసంగిపురం జంక్షన్ నుంచి బెండిగేటు వరకు ఉన్న ప్రధాన రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించాల్సిన అవసరం ఉందని, పెరుగుతున్న జనాభా దృష్ట్యా పలాస-కాశీబుగ్గకు ఒక రింగ్ రోడ్డు నిర్మాణం అత్యవసరమని అభిప్రాయపడ్డారు.



ఈ చర్చల్లో వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు కూడా అజెండా మీదకు వచ్చాయి. పట్టణంలోని పలు వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా ఉందని, చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు చేరుతోందని, తాగునీటి కొరత, చెత్త, వీధి దీపాల సమస్యలతో జనం నరకం చూస్తున్నారని కేత పూర్ణచంద్రరావు అన్నారు. "వార్డులో కాలు పెట్టని కొత్త ఆశావహుడు కౌన్సిలర్ గా పనికిరాడు, సమస్య తెలిసిన వాడికే టిక్కెట్ ఇవ్వాలి" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

అయితే ఈ పెళ్లి వేడుక వేదికగా జరిగిన చర్చల్లో అత్యంత ఆసక్తికరంగా, అందరిని ఆలోచింపజేసిన అంశం భూ ఆక్రమణలు. పలాస-కాశీబుగ్గ పరిధిలో భూ కబ్జాలు, చెరువు గర్భాల ఆక్రమణ, ప్రభుత్వ భూముల దందాపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. పట్టణంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే ఫెన్సింగ్ వేసి సొంతం చేసుకుంటున్నారని, అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఒక కొత్త ఆశావహుడు వాపోయాడు. ముఖ్యంగా చెరువుల గర్భాలు కబ్జాకు గురవుతున్నాయని, దీనివల్ల వర్షపు నీరు నిల్వ ఉండక పట్టణం ముంపునకు గురవుతోందని చర్చకు వచ్చింది. సూదికొండలో పగలు రాత్రి తేడా లేకుండా టిప్పర్లతో మట్టిని తరలించేస్తున్నారని వల్లభ వైకుంఠరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పెళ్లి వేడుకలో యాదృచ్ఛికంగా ఒకే వేదికపైకి వచ్చిన వివిధ పార్టీల ప్రత్యర్థులు, కొత్త ఆశావహులు చర్చించిన ఈ ప్రజా సమస్యల ఎజెండానే రానున్న ఎన్నికల్లో ప్రధాన అస్త్రం కాబోతోందనే సంకేతం స్పష్టంగా వినిపించింది.

# క్యాడర్ కు జగన్ దిశానిర్దేశం

- సెప్టెంబర్ 5 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్సీపీ విస్తృత స్థాయి సమావేశాలు
- రెండేళ్లుగా వెన్నుపోటు పార్టీ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి - ప్రజల్లోకి వెళ్లండి
- మండలం నుంచి జిల్లా స్థాయి వరకు భేటీలు - 5,6,7 జిల్లా స్థాయి,
- 8,9,10,11 అసెంబ్లీ స్థాయి, 12 నుంచి 22 వరకు మండల స్థాయి సమావేశాలు
- సమావేశాల్లోనే కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ - పార్టీ బలోపేతమే లక్ష్యం

వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ క్యాడర్ కు కీలక పిలుపునిచ్చారు. రెండేళ్లుగా వెన్నుపోటు పార్టీ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సెప్టెంబర్ 5 నుండి 22 వరకు వైఎస్సార్సీపీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన శ్రీకాకుళం జిల్లా నేతల మారథాన్ భేటీలో ఈ మేరకు రోడ్ మ్యాప్ ను ప్రకటించారు. ఈ భేటీలో జిల్లాలో పార్టీ బలోపేతంతో పాటు రాష్ట్రవ్యాప్త కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.

మండలం నుంచి జిల్లా స్థాయి వరకు సమావేశాలు నిర్వహించాలని, అక్కడే కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేయాలని జగన్ ఆదేశించారు. పార్టీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 5, 6, 7 తేదీల్లో ఏదో ఒక రోజు జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. 8, 9, 10, 11 తేదీల్లో ఏదో ఒక రోజు అసెంబ్లీ స్థాయిలో సమావేశం జరగనుంది. 12 నుంచి 22 వరకు ఏదో ఒక రోజు మండల స్థాయి సమావేశం నిర్వహించి, అక్కడే కార్యకర్తలకు ఐడీ కార్డులు కూడా పంపిణీ చేయనున్నారు. ప్రతి మండలంలో పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్టు జగన్ తెలిపారు.

ఈ సమావేశాల్లో ప్రధానంగా రెండేళ్ల కూటమి పాలనలో జరిగిన మోసాలు, సూపర్ సిక్స్ హామీల అమలులో వైఫల్యం, రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఎలా తుంగలో తొక్కారో ప్రజలకు వివరించాలని జగన్ సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, ఇప్పుడు చేస్తున్న పాలనకు పొంతన లేదని, ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, దానిని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ఉద్దానం ప్రాంతంలో ప్రతిపాదించిన కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో వేలాది ఎకరాల సారవంతమైన భూములు లాక్కోవడం, ఒకేసారి నాలుగు పంటలు పండే భూములను బలవంతంగా తీసుకోవడం, జీడి రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం, మద్దతు ధర ప్రకటించకపోవడం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయకపోవడం వంటి స్థానిక సమస్యలపై పోరాడాలని, రైతుల పక్షాన నిలబడాలని సూచించారు.

ఈ కీలక భేటీలో వైఎస్సార్సీపీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, పాతపట్నం నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి శాంతి, ఎచ్చెర్ల నియోజకవర్గ కోఆర్డినేటర్ గొర్లె కిరణ్ కుమార్, టెక్కలి నియోజకవర్గం కోఆర్డినేటర్ పేడాడ తిలక్, ఇచ్ఛాపురం నియోజకవర్గం కోఆర్డినేటర్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, ఆముదాలవలస నియోజకవర్గ కోఆర్డినేటర్ చింతాడ రవికుమార్ పాల్గొన్నారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీలో జగన్ ఒక్కొక్క నేతతో విడివిడిగా మాట్లాడి వారి నియోజకవర్గాల పరిస్థితిని ఆరా తీశారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ఈ విస్తృత స్థాయి సమావేశాలు ఎంతో కీలకమని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందనే భరోసా కల్పించేందుకే ఐడీ కార్డుల పంపిణీ చేపట్టామని జగన్ తెలిపారు. నేతల మధ్య చిన్న చిన్న విభేదాలను పక్కన పెట్టి సమన్వయంతో పనిచేయాలని, 2029 లక్ష్యంగా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల తర్వాత శ్రీకాకుళం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్సీపీ మరింత బలోపేతం అవుతుందని, కార్యకర్తల్లో కొత్త జోష్ వస్తుందని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## తెలంగాణలో ఫ్రీగా కుట్టుమిషన్లు

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలోని వెనుకబడిన తరగతుల (బీసీ) మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద అర్హులైన బీసీ మహిళలకు 100% సబ్సిడీపై ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందజేయనుంది. తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1.19 లక్షల కుట్టు మిషన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ పథకాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ అమలు చేయనుంది. ఒక్కో కుట్టు మిషన్ విలువ సుమారు రూ.12,000 ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంట్లోనే ఉంటూ ఉపాధి పొందాలనుకునే మహిళలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడనుంది.

**అర్హతలు, ప్రాధాన్యతలు**

ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు బీసీ సామాజిక వర్గానికి చెంది, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సులై ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించరాదు. అత్యంత పేద కుటుంబాలకు చెందిన మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, దివ్యాంగులతో పాటు ఇప్పటికే కుట్టుపనిలో అనుభవం లేదా శిక్షణ పొందిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**

అర్హులైన మహిళలు ఆగస్టు 15, 2026 నుంచి సెప్టెంబర్ 15, 2026 వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన తెలంగాణ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (TGOBMMS) అధికారిక పోర్టల్ tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అవసరమవుతాయి. పారదర్శక మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి కుట్టు మిషన్ వాడకంపై శిక్షణ కూడా ఇస్తామని అధికారులు స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి లేదా బీసీ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.









Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA)) - Bureau Chief, Telangana, 9618907705,
E-mail: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://epaper.navatharam.com